# ప్రజల మౌలిక సమస్యలను ప్రక్కదోవ పట్టించిన ఐదురాష్ట్రాల శాసనసభల ఎన్నికల ప్రచారం

**ఇటీవలే** ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగి నూతన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఆయారాష్ట్రాలలో పాలక, ప్రతిపక్ష పార్టీల ఎన్నికల ప్రచారం, మినీ సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణా రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో యధాప్రకారం డబ్బు, మద్యం, ఒకరిపై ఒకరు దిగజారి చేసుకునే నీచమైన ప్రచారాలు, కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టటంవంటి అన్ని దుర్మార్గమైన పద్ధతులనూ ఒకరిని మించి మరొకరు అనుసరించారు.

తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్, టిడిపి, టిజెఎస్, సిపిఐలతో కూడిన మహాకూటమి, సిపిఎం, ఇతర దళిత శక్తులతో కూడిన లెఫ్ట్ బహుజన ఫ్రంట్‌లతోపాటు అధికార పక్షంగావున్న టిఆర్ఎస్‌లు ఎన్నికలలో ప్రధానంగా పోటీపడ్డాయి. మహాకూటమి, టిఆర్ఎస్, బిజెపి నాయకులు ఎన్నికల ప్రచారంలో అసభ్య పదజాలాన్ని, నీచమైన దూషణలతో కూడిన ప్రచారం సాగించారు.

బిజెపి ప్రచారకర్తలు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొని మతతత్వ ప్రచారంతో ఎన్నికల వాతావరణాన్ని మార్చివేయటానికి ప్రయత్నించారు. భారతదేశంలో పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌ల వ్యవస్థాపకుడైన జోసెఫ్ కురియన్ శతజయంతి వేడుకల నిర్వహణకు సన్నాహాలు జరుగుతుండగా, బిజెపికి చెందిన పార్లమెంటు సభ్యుడు దిలీప్ సింఘానియా ఆయనపై ఆరోపణలు చేశాడు. జోసెఫ్ కురియన్ నాస్తికుడనే విషయం తెలిసి వుండి కూడా ఆదివాసీలను క్రిస్టియన్ మతంలోకి మార్చేందుకు అముల్ సంస్థనుండి నిధులు కల్పించాడనే ఆరోపణ చేశాడు.

మతతత్వ విద్వేష ప్రచారం బిజెపికి మాత్రమే పరిమితం కాదు. రాజస్థాన్ శాసనసభ ఎన్నికల ప్రచార సందర్భంగా కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ నాయకుడు సిపి జోషి మాట్లాడుతూ ఉమాభారతి, నరేంద్ర మోడీలు ఇరువురికీ హిందూమతం గురించి మాట్లాడే అర్హత లేదన్నాడు. వారిరువురూ బ్రాహ్మణులు కాకపోవటమే దానికి కారణమన్నాడు. హిందూమతం గురించి ఎవరికైనా తెలిసి వుంటుంది అంటే, వారు తప్పనిసరిగా బ్రాహ్మణ పండితులు మాత్రమేనని ఆయన నొక్కి వక్కాణించాడు.

నెహ్రూ కుటుంబ వారసత్వ రాజకీయాలపై బిజెపి ఆరోపణలను తిప్పికొట్టే నేపథ్యంలో ఓడరేవులు, నౌకా మంత్రిత్వశాఖ నిర్వహించిన విలాస్ ముత్తమ్‌వార్ మోడీ కుటుంబం గురించి మాట్లాడుతూ 'రాహుల్‌గాంధీ వెనుక ఐదు తరాల గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే నరేంద్రమోడీ తండ్రి పేరు కూడా ఎవరికీ తెలియద'ని అభ్యంతరకర వ్యాఖ్యానాలు చేశాడు.

ఎన్నికలు జరగని మహారాష్ట్రలోని బిజెపి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, పొరుగు రాష్ట్రాలలో జరుగుతున్న శాసన సభల ఎన్నికల సందర్భాన్ని అవకాశంగా తీసుకుంది. మరాఠాలను మహారాష్ట్రలో వెనుకబడిన కులంగా గుర్తించి విద్య, ఉద్యోగాలలో 16 శాతం రిజర్వేషను కల్పిస్తున్నట్లు ఈ సందదర్భంలో ప్రచారంలో పెట్టింది.

కనుక, మొత్తంగా ఈ ఎన్నికలలో అనేకమంది జోషీలు, సింఘానియాలు, ముత్తమ్‌వార్లే ఓట్లను సమీకరించటానికి మతాన్ని, కులాన్ని విస్తృతంగా ఉపయోగించారు. కాంగ్రెస్, బిజెపిలతో సహా పార్లమెంటరీ పార్టీల రాజకీయ పిరికితనం, సిద్ధాంత దివాళాకోరుతనాన్ని వీరి ప్రచార సరళి మనకు తేటతెల్లం చేస్తోంది.

అలాగే, ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్క రించకుండా, పాలకపార్టీల ఘోర వైఫల్యంనుండి ప్రజల దృష్టిని మళ్ళించే ప్రయత్నం కూడానని అర్ధమౌతోంది.

అలా ప్రక్కకు తప్పించిన అంశాలలో పెరుగుతోన్న వ్యవసాయరంగ సంక్షోభం ఒక ప్రముఖమైనది. ఇటీవల దేశవ్యాపితంగా వేలాదిమంది రైతులు ఢిల్లీ చేరుకొని ఒకరోజంతా నిరసనదీక్ష నిర్వహించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇతర అంశాలతోపాటు వ్యవసాయరంగ సంక్షోభాన్ని గురించి చర్చించాలని వారు డిమాండ్ చేశారు.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రాలు. కొనసాగుతన్న వ్యవసాయరంగ సంక్షోభం అనేకమంది రైతులను ఆత్మహత్యలవైపు నెడుతోంది. రైతాంగంలో అసంతృప్తి, ఆగ్రహం బ్రద్దలై, గత రెండు సం॥ల కాలంలో ఈ రాష్ట్రాలలో ఎన్నో రైతాంగ నిరసనాందోళనలు పెల్లుబికాయి. దీనితో ప్రభుత్వాలు సైతం దిగివచ్చి వారిని ఏదో విధంగా బుజ్జగించే ప్రయత్నాలు చేశాయి. రుణాలమాఫీ, పంటల బీమా, కనీస మద్దతు ధరల పెంపు వంటి అనేక హామీలు ఇచ్చి వారి ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నాలు చేశాయి. అయితే, పాలకులు ఏనాడూ వ్యవసాయ సంక్షోభానికి వెనుకగల అసలైన కారణాలను పరిష్కరించటానికి మాత్రం ప్రయత్నం చేయలేదు.

'ఛలో ఢిల్లీ' కార్యక్రమం సందర్భంగా అనేకమంది రైతులు తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల మినుములు, సజ్జలు, పెసల కనీస మద్దతు ధరలను పెంచుతున్నట్లుగా చేసిన ప్రకటనపై చికనీర్ అనే రైతును ప్రశ్నించగా అతను బిగ్గరగా నవ్వాడు. సజ్జల కనీస మద్దతు ధర క్వింటా రు.1900 వుండగా, తాము సజ్జలను క్వింటా రూ.1100 నుండి రు.1200 మధ్య అమ్ముకుంటున్నామని చెప్పాడు. మినుములు, పెసల పరిస్థితి కూడా అలాగే వుందని అన్నాడు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో రైతుల సహకార బ్యాంకు రుణాలను 50,000 రూ॥వరకు రద్దు చేస్తున్నట్లుగా, రబీపంటను మొత్తంగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఘనంగా ప్రకటించాడు. రైతాంగంలో చాలాకొద్దిమందికి మాత్రమే రుణాలు రద్దు కాగా,కనీస మద్దతు ధరల ప్రకారం పంట కొనుగోళ్ళు అనేది నామమాత్రంగా సాగిందని రైతులు పేర్కొన్నారు.

చిన్న, మధ్యతరహా రైతాంగానికి 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం' గురించి తెలియదు. పంటలు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ కూడా బీమా కంపెనీలు పంటల బీమా సొమ్మును ఇవ్వటానికి సిద్ధం కావటంలేదని ధనిక రైతులు సైతం చెబుతున్నారు. పంటల బీమా పేరిట ప్రభుత్వం ప్రైవేటు బీమా సంస్థలకు లబ్ధిచేకూరుస్తోందని ఏక కంఠంతో వారంతా నినదించారు.

ప్రభుత్వం ప్రకటించే నామమాత్రపు ఉపశమనాలు కూడా దుర్భర స్థితిలోనున్న పేదరైతాంగానికి చేరటంలేదు. రైతాంగంలో కేవలం 15 శాతం మంది మాత్రమే ఏదో మేరకు సంస్థాగత రుణపరపతి కలిగివుండగా, మిగిలిన వారంతా ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తోంది. అలాగే కనీస మద్దతు ధరల అంశంలో కూడా జరుగుతోంది. ప్రభుత్వ పంట కొనుగోలు సంస్థలు రంగంలోకి దిగే సమయానికి, పంటసీజను దాదాపు ముగింపుకొస్తోంది. రైతులు అనివార్యంగా తమ పంటలను తగ్గింపు ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవలసి వస్తోంది. కావున ప్రభుత్వ ఈ పథకాలన్నీ భూస్వామ్య సెక్షన్లకు ప్రధానంగా లబ్ధిచేకూర్చేవిగా వుండి, వారి ఆర్థిక సామర్థ్యాన్ని పెంపుచేసేవిగా వున్నాయి.

అలాగే ఎన్నికల ప్రచారంలో వివిధ పాలక పార్టీల నేతలు 'యువ భారత్' గురించి తరచుగా ప్రస్తావించారు. దేశంలో కోట్లాది యువజనులు భారతదేశ వాస్తవికమైన సంపదగా వారు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఆ యువజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో వారంతా విఫలమయ్యారు. కోట్లాదిమంది యువజనుల శక్తి సామర్థ్యాలు, వారి శ్రమశక్తి వృధా అవుతున్నాయి. యువజనులను విభజించి, ప్రక్కమార్గం పట్టించటానికి పాలకవర్గాలు కుల ప్రాతిపదికన రిజర్వేషన్లను ఉపయోగిస్తున్నాయి. ఒకవైపున పాలకపార్టీలు రిజర్వేషన్ శ్రేణిలో ఏదో ఒక కులాన్ని కొత్తగా చేర్చే డిమాండ్లను ప్రోత్సహిస్తూ వున్నారు. కానీ అదే సమయంలో విద్య ప్రైవేటీకరణను వేగవంతం చేయటం జరుగుతూ వుంది. ఫలితంగా విద్యావకాశాలను అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను చాలా కుదించి వేస్తున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి ఎన్నికలపై చేసిన ప్రకటనలో ప్రజలకు అందుకే ఈవిధంగా పిలుపు నిచ్చింది:

"ఈ రాష్ట్రాలలో ప్రభుత్వాలన్నీ కూడా ఫాశిస్టు తరహా అణచివేతను అమలుపరిచినవే. బిజెపికి, దాని మాతృసంస్థ ఆరెస్సెస్‌కు ప్రజలలో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి, వారిని చీల్చి వుంచటానికి హిందూత్వ నినాదం ఒక ఆయుధంగా మారింది. ప్రజల కోపాన్ని చల్లార్చేందుకు వారు కొన్ని ఉపశమన చర్యలు చేపడుతున్నారు. కానీ ప్రస్తుత సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థను కొనసాగించేందుకే వారు కట్టుబడి వున్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వుండటం, దాని ఫలితమైన పేదరికం, ప్రజల కడగండ్లు ప్రస్తుత అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజపు ఫలితాలు. ఈ వ్యవస్థ మారి ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పడనిదే ప్రజల జీవితాల్లో ఏవిధమైన అభివృద్ధి జరగదు. అర్ధభూస్వామ్య దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద దోపిడీకి, పెత్తనానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితపడి పోరాటం సాగించాల్సిందిగా పిలుపునిస్తున్నాం".

oooooo